నూతన కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి

చిలకలగూడ: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ముఖచిత్రాలతో రూపొందించిన ఈ కేలండర్‌ను వీక్షిస్తే భక్తిభావం పెరుగుతుందని, అందంగా తీర్చిదిద్దిన ఆలయ నిర్వాహకులను అభినందించారు. ఈనెల 23వ తేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఈట రాజేష్‌కుమార్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధులు వేణుగోపాలరావు, బాల భాస్కర్, ఆత్మరామసూర్యసుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, రామచందర్ పాల్గొన్నారు.

- ఈనెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలను ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు శ్రీగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈట రాజేష్‌కుమార్ తెలిపారు

వైభవంగా వీరభద్ర స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ప్రసిద్ధి చెందిన మురుమళ్ల దేవస్థానం వారిచే భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భద్రకాళీ సమేత వీరభద్ర ఆరాధ్య జనసేవా వాహిని ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేద పండితులు సాముహిక వన చండీ హోమాలు, సహస్ర లింగార్చన, ప్రముఖ ఆధ్మాత్మికవేత్త పురాణ ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావుచే సామూహిక సౌందర్య లహరి ప్రవచనం పారాయణ జరిగింది. అదే విధంగా ప్రముఖ నామ సంకీర్తనాచార్యులు కొడకండ్ల రాధాకృష్ణ శర్మ బృందంతో భక్తిగీతాలు విశేషంగా అలరించాయి. హనుమద్ ఉపాసకులు వక్కలంక ఆశ్రమం నిర్వాహకులు వాసుదేవానంద భారతిస్వామి హాజరయ్యారు. ఆకాశవాణి విశ్రాంత వ్యాఖ్యాత మడిపల్లి దక్షిణామూర్తి, సంస్కృత పండితులు సిద్ధరామయ్య శర్మ, ట్రస్టు చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

'చలోఢిల్లీని' విజయవంతం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మాదిగల చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని విద్యార్థి నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 18, 19న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి నేతృత్వంలో 21న ఎంఎస్ఎఫ్–టీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు ఢిల్లీలో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఓయూలో శుక్రవారం వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. వర్గీకరణపై గతంలో హామీ ఇచ్చిన బీజేపీ పార్టీ, ప్రధాని నరేంద్రమోదీ మాదిగలను మోసగించారని ఆవేదన వ్యక్తం చేశారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 55, పందిరి బీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండ 45, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 70, గోకరకాయ 55, కీర 21, దోసకాయ 25, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

బీసీల సమస్యలు పరిష్కరించాలని వినతి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బీసీ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ కలిసి బీసీల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని తెలిపారు. బీసీ గ్రాడ్యుయేట్లు, డిగ్రీ విద్యార్థులకు జీఆర్ఈ, బ్యాంకింగ్ కోసం ఉచిత కోచింగ్ అందించి, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్ రూ. 15 వేల కోట్లకు పెంచాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కోర్సుల స్కాలర్‌షిప్‌లను రూ. 5 వేల నుంచి రూ 25 వేల వరకు పెంచాలని కోరారు. రాజేశ్వర్ యాదవ్‌తో పాటు పూసల సత్యనారాయణ, లక్ష్మయ్య, నగేష్, సాయి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బంజారాహిల్స్: తెలంగాణ తొలి, మలి ఉద్యమ కారుల సంక్షేమం, ప్రయోజనాల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ, 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ప్రధాన కార్యదర్శి దుశర్ల సుదర్శన్ రావు కోరారు. జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సుమారు మూడు వేల మంది ఉద్యమ కారులు ఉన్నారని వీరి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్పొరేషన్ చైర్మన్ గా తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తాను 1965 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా వున్నానని ఇప్పటి వరకు ఎన్నో పదవులు కాంగ్రెస్‌లో అంకిత భావంతో నిర్వహించిన ట్లు చెప్పారు. ఇన్నాళ్ళకు తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేసే అవకాశం కాంగ్రెస్‌కు దక్కిందన్నారు. తాను ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న విషయం తెలిసిందే అన్నారు.

వృద్ధాప్యంలోనూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



చదరంగం ఆడుతూ..

- నిత్య వినోద, క్రీడాంశాలతో నవ యవ్వనంగా వయోధికులు
- మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యుల ప్రత్యేకత

సనత్‌నగర్: వృద్ధాప్యం వయస్సుకే గానీ మనస్సుకు కాదు అంటారు అక్కడ సీనియర్ సిటిజన్స్. వివిధ క్రీడాంశాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ నిత్య యవ్వన అనుభూతులను చవి చూస్తుంటారు. మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయం సీనియర్ సిటిజన్స్ ఆనందానికి నెలవైంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీకి చెందిన సీనియర్ సిటిజన్స్ అంతా ఒకచోట చేరి సందడిగా గడుపుతుంటారు.

అట పాటలతో సందడిగా..

వయస్సు మీద పడింది కదా...అని ఏదో మూలన కూర్చోవడం ఒకప్పటి మాట. ఇక్కడ సీనియర్ సిటిజన్స్ మాత్రం ఆటలతో అదరగొట్టేస్తున్నారు. క్యారమ్స్, చెస్ వంటి గేమ్స్‌తో మానసికోల్లాసం పొందడమే కాకుండా ట్రెడ్‌మిల్‌పై సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. చాలా కుటుంబాల్లో తమవారంతా కార్యాలయాలు, పిల్లలు స్కూళ్లు, కళాశాలలకో వెళ్లిపోతుండగా సీనియర్ సిటిజన్స్ ఇక్కడికి వచ్చి ఎవరు ఇష్టమైన గేమ్‌లో వారు ఆడుతూ ఒంటరితనాన్ని దూరం చేసుకుంటున్నారు.

2 వేల పుస్తకాలతో లైబ్రెరీ.

ఆటలాడేవారు ఆడుతుంటే ఇక్కడి లైబ్రరీలో పుస్తకాలు చదువుతున్న విజ్ఞాన సముపార్జన చేస్తుంటారు మరికొందరు. సాహిత్యం, ఆధ్యాత్మికం, హిస్టరీ..ఇలా దాదాపు 2 వేల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంచారు. కాలనీవాసులు ఇంటికి తీసుకువెళ్లేందుకు కూడా అనుమతిస్తారు. అలాగే దినపత్రికలు, మ్యాగజైన్స్ చదువుతూ కొత్త విశేషాలను తెలుసుకుంటుంటారు. ప్రతిరోజూ ఇక్కడికి నాలుగు రకాల పత్రికలతో పాటు వివిధ రకాల వీక్లీ మ్యాగజైన్స్ వస్తుంటాయి.

తోటి డేకేర్ సెంటర్లను సమన్వయం చేస్తూ..

కొంతమందితో ప్రారంభమైన ఇక్కడి అసోసియేషన్ కార్యకలాపాలు ఎన్నో కాలనీలకు చెందిన వయోధికులను ప్రభావితం చేసి దిక్సూచిగా నిలిచింది. మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జీహెచ్‌ఎంసీ ఆసరా కమిటీలో స్థానం పొందడంతో పాటు జెక్‌కాలనీ, సుందర్‌నగర్, సంజీవరెడ్డినగర్, ఆదిత్యనగర్ సైతం గుర్తింపు పొందేందుకు తమవంతు సహకారాన్ని అసోసియేషన్ అందించింది.

ఏడాదిలో రెండుమార్లు పోటీలు..

జనవరి 26, ఆగస్టు 15, అక్టోబర్ 1 (సీనియర్ సిటిజన్స్ డే) రోజుల్లో ఆసరా కమిటీ సహకారంతో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్‌లోని సీనియర్ సిటిజన్స్‌కు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తుంటారు. క్యారంబోర్డు, చదరంగం, బ్రిస్క్ వాకింగ్, టగ్ ఆఫ్ వార్, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహిస్తూ బహుమతులు ప్రదానం చేస్తారు.

70 ఏళ్లకు పైబడిన వారికి సన్మానం..

ఏడు పదులు దాటిన వయోధికులకు మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతియేటా సన్మానిస్తూ ఎప్పటికప్పుడు వారిలో నూతనోత్తేజాన్ని నింపుతోంది. దీనికి వారి కుటుంబ సభ్యులను కూడా ఆహ్వానించి భవిష్యత్ తరాలకు సీనియర్ సిటిజన్స్‌కు ఏ విధమైన గౌరవం, ఆప్యాయత చూపించాలో కళ్లకు కట్టినట్లు చూపిస్తుండడం విశేషం.



విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులతో మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ సభ్యులు (ఫైల్)

ఆత్మాభిమానంతో జీవించాలి..



ఏ సమాజంలో వృద్ధులు తల ఎత్తుకుని ఆత్మాభిమానంతో మనుగడ సాగిస్తారో ఆ సమాజమే సర్వోతోముఖంగా అభివృద్ధి చెందుతుంది. అన్ని రంగాల్లో ముందుంజ వేసి భావితరాలకు కరదీపికగా నిలుస్తోంది. ఇది ఒక భావన, ఒక ఆకాంక్ష, ఒక స్వప్నం, దీనిని సాకారం చేసుకోవాలంటే కలలో నుంచి ఇలలోకి రావాలి. నేటి సమాజంలోని వృద్ధుల స్థితిగతులను సామాజిక, శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలి.

–జేఎస్‌టీ శాయి, అధ్యక్షుడు, మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

ఆదర్శవంతంగా సనత్‌నగర్ నియోజకవర్గం



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే సనత్‌నగర్ ఆదర్శ నియోజకవర్గంగా మారిందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, వివిధ కాలనీల ప్రతినిధులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పీజీ రోడ్డులో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు లేక వర్షాకాలంలో స్థానిక ప్రజలే కాకుండా వాహనదారులు ఇబ్బందులు పడేవారని వివరించారు. తాను వచ్చిన తర్వాతనే సుమారు రూ.40 కోట్ల వ్యయంతో డ్రైనేజీ వ్యవస్థను మెగురుపర్చడం జరిగిందని, వైట్ ట్యాపింగ్ రోడ్లను నిర్మించి అద్భుతంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో నియోజకవర్గ పరిధిలో రూ.1400 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. పీజీ రోడ్డు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, సంజయ్ పత్తిపాక, గోపాల్, రోచాబాయ్, నవీన్ బర్కత్‌బాయ్, దీపక్, శృతి, పత్తిపాక, జగదీశ్ ప్రసాద్‌వర్మ తదితరులు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు.

సమష్టి కృషితోనే భారీ మెజార్టీ..

అమీర్‌పేట: ప్రతి ఒక్కరి సహకారం, సమష్టి కృషితోనే తాను సనత్‌నగర్‌లో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందానని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం అమీర్‌పేట బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో టిల్లు భాయ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. తన గెలుపుకోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటానన్నారు. అనంతరం ఆశా వర్కర్లకు చీరలు, యువకులకు రెయిన్ కోట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నేతలు మధుసూదన్‌రావు, షాబాద్ శ్రీనివాస్‌రావు, ఉదయ్, కట్ట బల్‌రాం, లలితా చౌహాన్, కూతురు నర్సింహ, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



యువకులకు రెయిన్ కోట్లు అందజేస్తూ..

ఓయూలో స్టార్టప్ ఫెస్ట్-24

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వేదికగా ఫిబ్రవరిలో ఉస్మానియా–ఇండియా స్టార్టప్ ఫెస్ట్–24ను నిర్వహించనున్నారు. శుక్రవారం ఓయూ పాలన భవనంలో అధికారులు ఫెస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉస్మానియా ఫౌండేషన్ (ఓఎఫ్), ఇండియా స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కలసి పనిచేయనున్నట్లు తెలిపారు. స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు, వక్తలు, సలహాదారులు, పెట్టుబడిదారులను ఒకే వేదికను పంచుకునేందుకు విధంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఓయూ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ విజయ్, జేఏ చౌదరి, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వయో పరిమితిని 58 ఏళ్లకు తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 61 నుంచి 58 ఏళ్లకు తగ్గించాలని, జీవో నంబర్ 45ను రద్దు చేయాలని ఓయూ విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉద్యోగ విరమణ వయసును కుదించాలని డిమాండ్ చేస్తూ బహుజన విద్యార్థి సంఘాలు, బహుజన జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో యూనివర్శిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్ మాట్లాడుతూ ఉద్యోగాలు భర్తీ చేయలేక గత ప్రభుత్వం ఉద్యోగుల వయోపరిమితిని పెంచి నిరుద్యోగులకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్–4 ద్వారా కాకుండా వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగాలు పాత పద్ధతిలోనే భర్తీ చేయాలన్నారు. ఓయూ వీసీ ప్రొ.రవీందర్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్కాలర్‌షిప్‌ల కోసం 'హైసెట్'

డిసెంబర్ 15 నుంచి జనవరి 15 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సనత్‌నగర్: ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం గయాసుద్దీన్ బాబుఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఉపకార వేతనాలు అందించనున్నారు. ఈ మేరకు టాలెంట్ కలిగిన విద్యార్థులను ఎంపిక చేసేందుకు హైసెట్ (హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ స్కాలర్‌షిప్ ఎంట్రన్స్ టెస్ట్)ను నిర్వహించనున్నారు. బేగంపేటలోని జకాత్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ సయ్యద్ అన్వరుల్ హుదా, హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ డైరెక్టర్లు జావెద్ హుడ్, అలీవుద్దీన్ హైదర్, ఆర్థిక నిపుణులు అమీరుల్లాఖాన్ తదితరులు హైసెట్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. డిసెంబర్ 15 నుంచి జనవరి 15 వరకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో హైసెట్ పరీక్ష జరుగుతుందన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ పరీక్ష రాయాలనుకునే వారు పదిలో 9.3 జీపీఏ గ్రేడ్‌తో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత సాధించిన వారికి రెండేళ్లకు రెండు దఫాలుగా రూ.5 లక్షల స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తామన్నారు. అంతేకాక హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కళాశాలతో పాటు ఇంటర్మీడియేట్ ప్రవేశం, భోజనవసతి సౌకర్యాలు అందజేస్తామన్నారు. ఉపకార వేతనాల కోసం హైసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 98665 56857, 96526 99811 లేదా http://hieset.in లో సంప్రదించాలన్నారు.

బీకేగూడ పార్కులో మూత్రశాలల ఏర్పాటు



పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మిబాల్‌రెడ్డి

అమీర్‌పేట: బీకేగడ వార్డు కార్యాలయం పార్కులో వాకర్స్ కోసం మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. పార్కులో ఉదయం వాకింగ్ చేసేందుకు వచ్చే వయోవృద్ధుల రద్దీ పెరిగి పోయిందని స్థానికంగా మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నాయకులు తన దృష్టికి తీసుకురాగా మంత్రిగా ఉన్న సమయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సమస్యను వివరించామన్నారు.అప్పట్లోనే పనులు ప్రారంభించాలని తలసాని ఆదేశించారని, ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో పనులు చేపట్టలేదన్నారు. ఎమ్మెల్యే చొరవతో ఎట్టకేలకు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. బాల్‌రెడ్డి, సంబంధిత అధికారులు సందీప్,అన్వర్,సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

'సొసైటీ స్థలం కోర్టు కేసులో ఉంది'

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–10లోని వాటర్ వర్క్స్ రిజర్వాయర్ పక్కన రాధికా కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన స్థల వ్యవహారం న్యాయస్థానంలో ఉన్నదని, ఈ స్థలాన్ని ఎవరికీ కేటాయించడానికి రెవెన్యూ అధికారులకు అధికారం లేదని సొసైటీ అధ్యక్షుడు తిలక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తమకు చెందిన ఈ స్థలంపై యథాతథ స్థితిని కొనసాగించాలని గతంలోనే హైదరబాద్ కలెక్టర్ జలమండలి అధికారులకు అధికారికంగా లేఖ కూడా రాశారన్నారు. ఇటీవలే ఈ స్థలంలో కొంత భాగాన్ని జలమండలికి కేటాయించాలని నిర్ణయించినట్లుగా తెలుస్తున్నదని, అలా జరిగితే తాము కోర్టు ధిక్కరణ కేసు వేస్తామన్నారు. ఇది పూర్తిగా రాధిక కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన స్థలమని, వీరికి సభ్యులు కూడా ఉన్నారని వెల్లడించారు. స్థలంలోకి అక్రమంగా ప్రవేశించినా కూడా నేరమే అవుతుందన్నారు. షేక్‌పేట్ మండల రెవెన్యూ అధికారులు, జలమండలి అధికారులు కలెక్టర్ ఇచ్చిన లేఖను పరిశీలించుకోవచ్చన్నారు.

గృహ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తేవాలి

పంజగుట్ట: తెలంగాణలో ఉన్న సుమారు 11 లక్షల మంది గృహ కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు వారికి సరైన చట్టం తీసుకురావాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్రం డిమాండ్ చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వర్గీస్ తెకనాథ్, పీవో డబ్ల్యూ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ... హైదరాబాద్‌లోనే ఐదు లక్షల మంది, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఆరు లక్షల మంది గృహ నిర్మాణ కార్మికులు ఉన్నారన్నారు. వారిని కార్మికులుగా గుర్తించేందుకు, వారి హక్కులను రక్షించేందుకు ఎలాంటి చట్టం లేదన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఏడు జిల్లాలకు చెందిన ఆరు వందల మంది యూనియన్ ప్రతినిధులు సమావేశమై గృహకార్మికుల పరిస్థితులు, యజమానుల నమోదు, గుర్తింపు కార్డుల జారీ, త్రైపాక్షిక సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర అంశాలను చట్టంలో చేర్చాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ, కేరళ, ఒడిశా, తమిళనాడు లాంటి రాష్ట్రాలు గృహ కార్మికులకు చట్టలు చేసేందుకు సిద్ధం అవుతున్నాయని వాటి అన్నింటికన్నా ముందు తెలంగాణ రాష్ట్రం చేస్తే మొదటి రాష్ట్రంగా నిలుస్తుందన్నారు.

ఎల్లారెడ్డిగూడలో చోరీ

వెంగళరావునగర్: యువకులు నిద్రిస్తున్న గదిలో చోరీ జరిగిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జనగాం ప్రాంతానికి చెందిన రమాకాంత్‌రెడ్డి ఎల్లారెడ్డిగూడలోని అలీనగర్‌లో తన స్నేహితుడు రణధీర్‌తో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున తాము ఉంటున్న గది తలుపులు తీసి నిద్రిస్తుండగా గుర్తు తెలి యని వ్యక్తి ఆ గదిలోకి ప్రవేశించాడు. రెండు సెల్‌ఫోన్లు, రూ. 50 వేల నగదు దొంగిలించుకుని వెళ్లాడు. ఉదయం లేచి చూడగా తమ ఫోన్లు, న గదు కనిపించలేదు. బాధితులు స్థానికంగా ఉన్న సీసీ పు టేజీను పరిశీలించారు. ఓ నిందితుడు తమ గదిలో నుంచి నగదు, ఫోన్లు తీసుకుని వెళ్తున్న దృశ్యం కనిపించింది. ఈ మేరకు బాధితులు మధురానగర్ పో లీసులకు ఫిర్యా దు చేశారు.

సందిగ్ధంలో కంటోన్మెంట్ భవితవ్యం!

- రెండున్నర దశాబ్దాల చరిత్ర
- ప్రత్యేక పాలన వ్యవస్థలుగా కంటోన్మెంట్ బోర్డులు
- రద్దు దిశగా కేంద్రం కీలక అడుగులు
- పరిశీలన దశలో విలీన ప్రక్రియ
- నేడు డిఫెన్స్ ఎస్టేట్స్ డే

కంటోన్మెంట్: రెండున్నర శతాబ్దాల చరిత్ర కలిగిన కంటోన్మెంట్‌ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. బ్రిటిష్ పాలనఆవశేషంగా కొనసాగుతున్న కంటోన్మెంట్‌లు త్వరలోనే కనుమరుగయ్యే అవకాశముంది. వర్తకం కోసం భారత దేశానికి వచ్చిన బ్రిటిషర్స్ ఈస్ట్ ఇండియా కంపెనీతో తమ పాలన ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. తొలినాళ్లలో మిలటరీ స్థావరాలుగా ఏర్పడ్డ కంటోన్మెంట్‌లు కాలక్రమేణా పురపాలికలుగా మారాయి. ఆయా కంటోన్మెంట్‌లో పాలన కోసం 1924లో ప్రత్యేక చట్టం కూడా అమల్లోకి వచ్చింది. అవిభాజ్య భారతంలో 100కు పైగా ఉన్న కంటోన్మెంట్‌లు, ప్రస్తుతం దేశంలో 61 ఉన్నాయి. ఇటీవలే కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసే ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు క్యాస్‌యోల్ కంటోన్మెంట్ ప్రస్థానం ముగిసింది. ప్రయోగాత్మకంగా దేశంలోనే అతి పెద్దదైన సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీనం చేపట్టాలని గత జనవరిలోనే కేంద్రం కార్యాచరణ మొదలుపెట్టింది. పది నెలలుగా ఈ ప్రక్రియలో ఎలాంటి కదలిక లేదు. అసలు విలీనం జరగుతుందా? కంటోన్మెంట్‌లు యథావిధిగానే కొనసాగుతాయా? అన్న సందిగ్ధంలో కంటోన్మెంట్‌లో శనివారం డిఫెన్స్ ఎస్టేట్స్ డే వేడుకలు జరగనున్నాయి.

బ్యారక్‌పూర్ నుంచి మొదలై..


వర్తకం నిమిత్తం బెంగాల్‌లో మొదలైన ఈస్ ఇండియా కంపెనీ తొలి మిలటరీ స్థావరం 1765లో బ్యారక్‌పూర్‌లో ఏర్పాటైంది. తదనంతర కాలంలో దేశమంతా విస్తరించిన కంటోన్మెంట్‌ల పరిధిలో మిలటరీ అధికారుల సేవల కోసం సివిల్ ఏరియాలు సైతం ఏర్పడ్డాయి. తదనంతరం ఆయా ప్రాంతాల పాలనావసరాల కోసం ఏర్పాటైతే కంటోన్మెంట్ బోర్డులు. తొలి నాళ్లలో వీటి పాలన వ్యవహారాలు పూర్తిగా ఆర్మీ అధికారుల పర్యవేక్షణలోనే సాగేవి. కంటోన్మెంట్ ప్రాంతాల్లో పాలన, భూముల నిర్వహణకు 1924లో 'ది కంటోన్మెంట్ యాక్ట్–1924' (ఇందులోనే కొన్ని మార్పులతో 2006లో రాజ్యాంగ సవరణ ద్వారా 'ది కంటోన్మెంట్స్ యాక్ట్–2006' మార్చారు.) పేరిట ప్రత్యేక చట్టం ఏర్పాటైంది. ఆ తర్వాత



1937లో కంటోన్మెంట్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ రూల్స్ (సీఎల్ఏఆర్), జనరల్ ల్యాండ్ రికార్డ్స్ (జీఎల్ఆర్)లు రూపుదిద్దుకున్నాయి. కంటోన్మెంట్‌లకు అవతల ఉన్న భూముల నిర్వహణ కోసం మిలటరీ ల్యాండ్ రికార్డ్స్ (ఎంఎల్ఆర్) చట్టం అమల్లోకి వచ్చింది. 1940లో ది మిలటరీ ల్యాండ్స్ అండ్ కంటోన్మెంట్ సర్వీస్ (ఎంఎల్‌సీఎస్) ఏర్పాటైంది. 1948 నుంచి సివిల్ సర్వీసెస్ పరీక్షల ద్వారా ఎంఎల్‌సీఎస్ అధికారుల నియామకం జరుగుతోంది. 1985లో ఈ సర్వీసునే ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీసెస్ (ఐడీఈఎస్)గా మార్చారు.

లష్కర్ ది కంటోన్మెంట్..

లాటిన్ భాషలో 'కంటోన్' అంటే మిలటరీ 'మెంట్' అంటే స్థావరం అని అర్థం. సికింద్రాబాద్ పేరిట ఏర్పడిన కంటోన్మెంట్ ప్రాంతానికి స్థానిక ముస్లిం నవాబులు తమ ఉర్దూ భాషలో లష్కర్ (మిలటరీ)గా వ్యవహరించే వారు. ఈ నేపథ్యంలోనే సికింద్రాబాద్‌కు లష్కర్ అనే పేరు వచ్చింది. నిజాం నవాబు సికిందర్‌జా పేరిట దీనికి సికింద్రాబాద్‌గా నామకరణం చేసినప్పటికీ కంటోన్మెంట్, లష్కర్ పేర్లు నేటికీ వాడుకలో ఉండటం గమనార్హం.



సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను నిజాం ప్రధానికి అప్పగిస్తున్నప్పటి చిత్రం.. ఒప్పందంపై పరస్పరం సంతకాలు చేస్తున్న నాటి నిజాం ప్రధాని నవాబ్ చతారి, బ్రిటిష్ అధికారి సర్ ఆర్థర్ లూథయిన్